క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మహేశ్వరం: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మహేశ్వరం ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాబ్‌సిటీ, ప్లాస్టిక్ పార్కు, టీర్‌పాల్, మైక్రోమ్యాక్స్, రావులూర్, ముచ్చర్ల ఫార్మాసిటీ, అమెజాన్ కంపెనీలు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. సిబ్బందికి సహకరించాలని కోరారు.

ప్రశాంతంగా గ్రూప్-1



పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీఐ కిరణ్‌కుమార్

మీర్‌పేట: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సీఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో మొత్తం 9 పరీక్షా కేంద్రాల్లో 5,592 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 3,389 మంది పరీక్ష రాశారని, 2203 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశామని సీఐ పేర్కొన్నారు.

భట్టి విక్రమార్కను కలిసిన భాస్కర్‌రెడ్డి



దిల్‌సుఖ్‌నగర్: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర నల్గొండ జిల్లా దేవరకొండకు చేరుకొని 1000 కిలో మీటర్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆయనను ఆదివారం మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి కలిసి కేకు కట్ చేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలతో విద్యార్థుల్లో పోటీతత్వం

సైదాబాద్: వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి ప్రోత్సాహకాలు అందించడం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందుతుందని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాల డైరెక్టర్ కె.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. చంపాపేటలోని పాఠశాలలో శ్రీత్రివేణి విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం, పేరెంట్ ఓరియేషన్ కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25 వేల నగదు పురస్కారాలు, ఒకటి నుంచి 9వ తరగతికి చెందిన 75 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. డీఆర్‌డీఓ సైంటిస్ట్ రామకృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బార్ల సునీత, పాఠశాల చైర్మన్ జిట్టా సురేందర్‌రెడ్డి, సునీల్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ శారద, యోగీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మాయా‘జలం’

- అనుమతుల్లేవ్.. నిబంధనలు పట్టవు
- మంచినీటి పేరిట మహామోసం
- నీటిశుద్ధి కేంద్రాల్లో శుభ్రత కరవు

పహాడీషరీఫ్: జల్‌పల్లి పేరులోనే ఉంది జలం. అలాంటి మున్సిపాలిటీలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అనధికార వాటర్ ప్లాంట్లు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయని పుర ప్రజలు ఆరోపిస్తున్నారు. నగరంలో రోజు విడిచి రోజు కృష్ణా తాగునీరు సరఫరా అవుతుండగా.. పురపాలికలో మాత్రం అంతంత మాత్రంగానే ఉందని, స్థానిక బోరు నీటితో కలిపి సరఫరా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ నెలకొన్న నీటి ఎద్దడినే పెట్టుబడిగా పెట్టుకున్న కొందరు వ్యాపారులు.. సంపాదనే ధ్యేయంగా.. మంచినీటి పేరుతో ప్రమాణాలకు తిలోదకాలిస్తూ.. మహామోసం చేస్తున్నట్లు సమాచారం. కనీస శుచి శుభ్రత పాటించకుండా ఇష్టానుసారంగా నచ్చిన ధరలకు విక్రయిస్తున్నారు.

పట్టని నిబంధనలు..

జల్‌పల్లి, శ్రీరాంకాలనీ, పహాడీషరీఫ్, వాదే ముస్తఫా, వాదే సాల్హె హీన్ కాలనీ, ఎర్రకుంట, కొత్తపేట, షాహీన్‌నగర్ ప్రాంతాల్లో ఎటువంటి నిబంధనలు పాటించకుండా పెద్ద ఎత్తున వాటర్ ప్లాంట్లు కొనసాగుతున్నాయి. వాటర్ టెస్టింగ్ రిపోర్ట్, వాటికి ట్రేడ్ లైసెన్స్, కమర్షియల్ ట్యాక్స్‌లు ఏవీ కనిపించడం లేదు. శ్రీరాం కాలనీలో ఉత్తర భారతీయులు కొనసాగిస్తున్న ప్లాంట్.. అపరిశుభ్రతకు నిలయంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తాలేని ఐఎస్ఐ ట్రేడ్ మార్క్

మున్సిపాలిటీలో కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లలో ఐఎస్ఐ మార్కింగ్ మాత్రం ఎంత వెతికినా కనబడదు. బస్తీలో కొనసాగుతున్న ప్లాంట్ల నిర్వాహకులు.. సంబంధిత వాటర్ డబ్బాలపై ‘ప్యాకేజ్డ్ డ్రికింగ్ వాటర్’ అని ముద్రించాలి. ఫుడ్ లైసెన్స్ సహా అన్ని నియమాలు పాటించినట్లయితేనే డబ్బాలపై ‘మినరల్ వాటర్’ అని ముద్రించాల్సి ఉంటుంది. కానీ.. ఇలాంటి ప్రమాణాలు పాటించకుండా.. ‘మినరల్ వాటర్’ అంటూ ప్లాంట్ల నిర్వాహకులు మోసం చేస్తున్నారని పుర ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అనుమతి లేని నీటి శుద్ధి కేంద్రాలపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వాదే సాల్హెహీన్ బస్తీలోని అనుమతులు లేని వాటర్ ప్లాంట్

అధికారులు చర్యలు తీసుకోవాలి



మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా సరిగా లేదు. ఇదే అదనుగా భావించిన కొందరు వ్యాపారులు ‘మినరల్ వాటర్’ పేరిట అపరిశుభ్రమైన నీటిని విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. సంబంధిత అధికారులు అక్రమ నీటి వ్యాపారులపై తగిన చర్యలు తీసుకోవాలి. జల్‌పల్లిలో రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేయాలి. నిరుపేదలు డబ్బులు వెచ్చించి శుద్ధమైన నీటిని కొనుక్కోలేని స్థితి. ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టి సారించాలి.

– యంజాల శివకుమార్, జల్‌పల్లి

సీఐ కృష్ణంరాజుకు సన్మానం



సీఐ కృష్ణంరాజును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు

వీడ్కోలు సభలో వక్తలు

కందుకూరు: సీఐగా కృష్ణంరాజు మూడేళ్ల పాటు సమర్థవంతంగా విధులు నిర్వహించి, ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఏంటో చూపి సిబ్బందికి మార్గదర్శిగా నిలిచారని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, యువజన సంఘాల నాయకులు కొనియాడారు. ఆదివారం మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో సీఐని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం నూతన సీఐగా వచ్చిన విష్ణువర్ధన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఉద్యోగులంతా కృష్ణం రాజును ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతిపాండు, జెడ్పీటీసీ జంగారెడ్డి, వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు అశోక్, పెద్దరామయ్య, సీపీఎం జిల్లా నాయకుడు రాంచందర్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, సర్పంచులు వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గం పెద్దపులి నాగారం అనుబంధ గ్రామం పడమటి తండాకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు సుమారు 80 మంది ఆదివారం మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సేనావత్ రాజు, వెంకటేష్, అభరియా, గోపాల్, సురేష్, మంగ్య, దేవజ, రవి, లక్ష్మణ్ నాయక్‌తో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజునాయక్, నాగారం గ్రామ సర్పంచ్ లావణ్య, లింగం, పడమటి తండా సర్పంచ్ అనిత తదితరులు పాల్గొన్నారు.



సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నేతలు

అధికారుల కనుసన్నల్లోనే కబ్జాల పర్వం

మాసబ్ చెరువును పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి

తుర్కయంజాల్: మాసబ్ చెరువు కబ్జా అవుతున్నా పట్టించుకోకుండా అక్రమార్కులకు అండగా నిలుస్తున్న అధికారులను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక జైలుకు పంపిస్తామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులతో కలిసి చెరువు శిఖం సర్వే నంబర్ 137లో వేసిన రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నో గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగడానికి ఉపయోగపడే ఈ చెరువును ల్యాండ్ మాఫియా కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారుల కనుసన్నల్లోనే ఈ కబ్జాల పర్వం కొనసాగుతుందని ఆరోపించారు. అధికారులు, ప్రభుత్వం ఇకనైనా స్పందించి చెరువు ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెరువు పరిరక్షణ సమితి అధ్యక్షుడు రమేష్, కౌన్సిలర్లు మంగమ్మ, సునీల్, శ్రీలత, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు నర్సింహాగౌడ్, నాయకులు అరుణ్‌కుమార్, వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలను పరిశీలిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

ఆర్థికసాయం అందజేత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి బాలాపూర్ మండల కేంద్రంలోని 15వ డివిజన్‌కు చెందిన అర్జున్ ఇటీవల మరణించారు. అతడి కుటుంబ సభ్యులను బాబు జగ్జీవన్‌రాం యూత్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం పరామర్శించారు. రూ.30వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రాజు, గిరీష్, శ్రీరాములు, నర్సింగరావు, వీరుడు, నాగేష్, కిన్నెర, ప్రవీణ్, జంగయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బడంగ్‌పేటలో 5కే రన్

మీర్‌పేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహిస్తున్నట్లు మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు బడంగ్‌పేట నూతన మున్సిపల్ కార్యాలయం నుంచి మంత్రాల చెరువు వరకు 5కే రన్ కొనసాగుతుందని, కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, కార్పొరేటర్లు పాల్గొంటారని అన్నారు.

చెన్నారం రోడ్డుపై బ్రిడ్జి నిర్మించండి

కేంద్రమంత్రి మహేంద్రనాథ్ పాండేకు బీజేపీ నేతల వినతి

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మంగళపల్లి నుంచి చెన్నారం వెళ్లే రోడ్డు గుండా ప్రవహించే వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖామంత్రి మహేంద్రనాథ్ పాండేకు బీజేపీ సీనియర్ నాయకుడు రాంరెడ్డి, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి ఎర్రవోలు శ్రీనివాసులు కోరారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో ఆదివారం కేంద్రమంత్రి మహేంద్రనాథ్ పాండేను వారు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, జంగయ్య, శ్రీనివాసులు, శ్రీశైలంయాదవ్, ఎడ్ల శ్రీశైలం, వెంకటేశ్, శ్రీకాంత్, మురళి తదితరులు ఉన్నారు.

మేడిగడ్డ బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన..

తలకొండపల్లి: కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి మహేంద్రనాథ్ పాండేను బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ సన్మానించారు. ఆదివారం ఆమనగల్లు మండలం మేడిగడ్డ గ్రామంలో కేంద్రమంత్రి పర్యటించారు. గ్రామ సడక్ యోజనలో భాగంగా రూ.3 కోట్ల27 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. అట్టి పనులను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్‌నేత ఆచారీ, మాజీ జెడ్పీటీసీ హరిప్రసాద్, పార్లమెంట్ కోకన్వీనర్ కమలేష్, నియోజకవర్గ కోకన్వీనర్ నర్సింహ, శ్రీశైలం, లక్ష్మణ్, ప్రశాంత్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బాటసింగారం జెడ్పీహెచ్ఎస్ 1985-86 బ్యాచ్ విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86వ విద్యాసంవత్సరం పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం బాటసింగారంలోని పీవీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమావేశమయ్యారు. దాదాపు 37ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఓకేచోటు కలిసి తమ జ్ఞాపకాలను నెమరువేసుకోవడంతో పాటు కష్టసుఖాలను పంచుకున్నారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అందరూ ఓకే రకమైన దుస్తులను ధరించి సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విష్ణుగౌడ్, శివరాంరెడ్డి, జంగయ్యయాదవ్, ధన్‌రాజ్‌గౌడ్, జగదీశ్వర్, చంద్రశేఖర్, మహేందర్‌గౌడ్, క్రిష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, నరేందర్, క్రిష్ణారెడ్డి, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి ఎన్ఆర్ఐ విరాళం

దిల్‌సుఖ్‌నగర్: అమెరికాలో ఉంటున్న ప్రవాస భారతీయుడు, సరూర్‌నగర్ ఎస్వీ కాలనీకి చెందిన రజనీకాంత్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి రూ.25 వేలు విరాళం అందజేశారు. ఆన్‌లైన్ ద్వారా ఈ మొత్తాన్ని పంపించారు. ఈ డబ్బుతో విద్యార్థులకు అవసరమయ్యే స్కూల్ యూనిఫాం, బ్యాగ్స్, స్టేషనరీ కొనుగోలు చేయాలని గృహం నిర్వాహకులను కోరారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌కు గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తపల్లిలో ‘ఐపీఎల్’ పోటీలు ప్రారంభం

యాచారం: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్థాయి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. గ్రామ పెద్దలు అలుగుపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఈగ మధుసూదన్‌రెడ్డి ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఆసక్తికలిగిన క్రీడాకారులు పోటీలో పాల్గొనాలని కోరారు. ప్రథమ బహుమతి రూ.22,222, రెండో బహుమతి కింద రూ. 11,111 అందజేస్తామని నిర్వాహకులు శ్రీశైలం తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు చందు, రవి, కృష్ణ, విప్లవ్‌కుమార్, యాదగిరి, వినోద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాటా 30, వంకాయ 33, బెండ 45, పచ్చిమిర్చి 65, కాకర 38, బీర 35, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 125, క్యారెట్ 50, దొండ 25–28, చిక్కుడు 85, గోకర 40, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలు 20, దోస 15, సొర 11, పొట్ల 18, ఉల్లి 16, చామగడ్డ 35. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కలగానే జూనియర్ కళాశాల ఏర్పాటు?

- తలకొండపల్లిలో ఇంటర్ కళాశాల లేక ఇబ్బందులు
- నిరాహార దీక్షలు చేసినా దక్కని ఫలితం
- ఏటా టెన్త్ పూర్తిచేస్తున్న వెయ్యిమందికి పైగా విద్యార్థులు
- కళాశాల లేక పదితోనే సరి!

తలకొండపల్లి: ప్రతి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించి పేద విద్యార్థులకు మేలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్న, అవి ఆచరణలో అమలుగాక కాగితాలకే పరిమితమవుతున్నాయని పలువురు విద్యావేత్తలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. పది చదివిన విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసించలేక మధ్యలోనే అర్థాంతరంగా చదువును మానేస్తున్నారు.

ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు

మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని గతంలో పార్టీలకతీతంగా వివిధ పార్టీల నాయకులు అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేపట్టారు. అయినా ఫలితం లేదని పలు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.


మండలంలోని ఉన్నత పాఠశాలలు..

మండల కేంద్రంతో పాటు, చంద్రధన, వెల్జాల్, గట్టుఇప్పలపల్లి, ఖానాపూర్, చుక్కాపూర్, రాంపూర్, పడకల్‌తో పాటు, కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలున్నాయి. ఇవికాక పరిసర ప్రాంత గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలలో సుమారుగా ప్రతి యేటా 1000 మంది విద్యార్థులు పదొవ తరగతి చదువుతున్నారు. వీరిలో సగానికి పైగా విద్యార్థులు ఇంటర్ విద్యను చదవలేక పోతున్నారు. ఆర్థికంగా ఉన్నవారు మాత్రమే పట్టణాల్లో కెళ్లి చదువుతున్నారు. ఫీజులు కట్టలేని పేద విద్యార్థులు మాత్రం ఇంటర్ విద్యకు దూరమవుతున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలోనైనా మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, విద్యార్థులతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



తలకొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల


ఆందోళనలు చేపడుతాం



విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని గతంలో అనేక పర్యాయాలు అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు, చేపట్టాం. అయినా ప్రభుత్వ యంత్రాంగం ఏ మాత్రం స్పందించడంలేదు. బీజేవైఎం ఆధ్వర్యంలో మరోసారి నిరాహార దీక్షలు, ఆందోళనలు చేపట్టి కళాశాల ఏర్పాటుపై కృషి చేస్తాం. ఆందోళనలో అందరూ కలిసిరావాలి.

– అనిల్, ఉప సర్పంచ్, తలకొండపల్లి


ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం



జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని మండల సర్వసభ్య సమావేశాల్లో తీర్మానించాం. పలు సందర్భాల్లో మంత్రి సబితారెడ్డికి వినతిపత్రాలు అందజేశాం. అయిన ప్రభుత్వంలో చలనం లేదు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు అయితే మండలంలోని 32 గ్రామాలతో పాటు, చుట్టూ పక్కల పరిసర గ్రామాల విద్యార్థులకు మేలు జరుగనుంది. ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలి.

– నిర్మల, ఎంపీపీ, తలకొండపల్లి

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో జూనియర్ కళాశాల లేక నిరుపేద విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరమవుతున్నారు. పదితోనే చదువు మానేస్తున్నారు. పేద విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి.

– అశోక్‌గౌడ్, గట్టుఇప్పలపల్లి

హిందీ కవి విజయకుమార్‌కు గౌరవ డాక్టరేట్



వనస్థలిపురం: తెలంగాణకు చెందిన హిందీ కవి, వనస్థలిపురం నివాసి గుండాల విజయకుమార్‌కు మౌంట్ ఎల్బర్ట్ సెంట్రల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. తెలంగాణ ప్రాంతంలో హిందీ భాష వ్యాప్తికి విజయకుమార్ చేసిన కృషిని గుర్తించి యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేసింది.

భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రజాసేవే లక్ష్యంగా ఐక్యతా ఫౌండేషన్ పనిచేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐక్యతా ఫౌండేషన్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కార్యాలయాన్ని మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు మాడ్గుల మండల కేంద్రంలో ప్రజలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు సుంకిరెడ్డి వివరించారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జైపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, సురేశ్, రామ్‌లాల్, జంగయ్య, బాలు నాయక్, హరిలాల్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్‌జామ్



నియంత్రణకు చర్యలు తీసుకోని పోలీసులు

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో బొబ్బిలి దామోదర్‌రెడ్డి గార్డెన్ సమీపంలోని తెలంగాణ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు నరకం చవిచూస్తున్నారు. ఈ కూడలిలో నలువైపుల నుంచి వాహనాలు జిగ్‌జాగ్‌గా వస్తుండటంతో ప్రతిరోజూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ఈ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేయక పోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు గంటల కొద్దీ సమయం రోడ్డుపై ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక వాహనదారులే పూనుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ ఉన్నతాధికారులు స్పందించి ఈ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు కానిస్టేబుళ్లను నియమించాలని వాహనదారులు కోరుతున్నారు.

‘మేధస్సు పెంపునకు సంగీతం దోహదం’

సైదాబాద్: భారతీయ కళలైన నృత్య, సంగీతాలు మేధస్సును పెంచడంలో సహకరిస్తాయని లక్ష్మీనగర్ కాలనీ శ్రీవేంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర భక్తసమాజంలో శ్రీగాయత్రి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో కళార్చన పేరిట కళాకారిణులు సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శించారు. బెంగళూరు కళాకారిణి నాట్యవిశారద క్షితిజ కాసరవెల్లి సహా పలువురు కళాకారిణులు ప్రదర్శించిన భారతీయ కూచిపూడి శైలి నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కామేశ్వరి, జ్యోతి, రమ్యరెడ్డి, సత్యప్రకాష్ యాదవ్,ఎన్.ప్రసాదరావు, శేషగిరి రావు, వేదుల కనకదుర్గ పాల్గొన్నారు.